# 19. పేర్ల పురాణం

సృష్టికర్త తొలి మానవుడైన హ౹జ్రత్ ఆదం (అలైహి)ను సృజించి ఆయనకు ప్రపంచంలోని వస్తువుల పేర్లన్నీ నేర్పాడు. మానవుడు దేవుని ప్రతినిధిగా ప్రపంచంలో మనుగడ సాగించవలసి ఉన్నందున ఆయనకు సకల వస్తువుల జ్ఞానం ప్రసాదించవలసి వచ్చింది. కాని దైవదూతలు ఈ సంగతి తెలియక మానవుని విషయంలో అపోహకు గురయ్యారు. దేవుడు దైవదూతలను పేర్లు చెప్పమని అడిగినప్పుడు “మాకు నీవు ప్రసాదించిన జ్ఞానం తప్ప మరేమీ తెలియద”ని అన్నారు వారు. అప్పుడు విశ్వప్రభువు హ౹జ్రత్ ఆదం (అలై)ని అడిగితే ఆయన మొత్తం పేర్లు తెలియజేశారు.

ఈవిధంగా మానవుడు అన్నిటికంటే ముందు పేర్లు నేర్చుకున్నాడు. అంచేత ఈ పేర్లకు ఎంతో ప్రాముఖ్యం వచ్చింది. ముఖ్యంగా మానవసంతతి క్రమంగా అభివృద్ధి చెంది తెగలుగా, జాతులుగా ఏర్పడి ప్రపంచమంతటా విస్తరించడంతో పేర్ల ఆవశ్యకత మరింత అధికమయింది. తెగలకు, జాతులకు పేర్లు పెట్టడం జరిగింది. ప్రారంభంలో కొందరు ముఖాలను మాత్రమే గుర్తించగలిగేవారు కాని, పేర్లు మరచిపోయేవారు. మరి కొందరు పేర్లను జ్ఞాపకం ఉంచుకొని ముఖాలను గుర్తించగలిగేవారు కాదు. అందువల్ల వివిధ వ్యక్తుల పేర్ల అర్థంతో పాటు వారు ఏ జాతికి, ఏ తెగకు చెందినవారైనది తెలిస్తే పేర్లను గుర్తుంచుకోవడం సులభమవుతుందని భావించారు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) మనుషుల పేర్ల విషయం ప్రస్తావిస్తూ “ప్రళయదినాన మీరు మీమీ పేర్లతో పిలవబడతారు. కనుక మంచి పేర్లు పెట్టుకోండి” అని చెప్పారు. (అబూదావూద్); ఎవరైనా తప్పుడు పేర్లు పెట్టుకుంటే దైవప్రవక్త (స) వాటిని మార్పించినట్లు కూడా హదీసుల్లో ఉంది. కాబట్టి పిల్లలకు పేర్లు పెట్టేటప్పుడు బాగా ఆలోచించి మంచి అర్థం వచ్చే పేర్లు మాత్రమే పెట్టాలి.

మనుషుల పేర్లు రకరకాలుగా ఉంటాయి. దేవునికి ఉన్న తొంభై తొమ్మిది గుణనామాలకు ముందు “అబ్ద్” అనే పదం చేర్చగా ఏర్పడే పేర్లు ఒక రకమైనవి. ఉదాహరణకు:– అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ గఫూర్, అబ్దుర్రహ్మాన్ మొదలైనవి. దేవుని పేరుకు ‘అబ్ద్’ అనే పదం చేర్చినపుడు మధ్యలో సంధిగా “అల్” అనే పదం వస్తుంది. అరబీ భాషలో ‘అబ్ద్’ అంటే దాసుడు అని అర్థం. అయితే అచ్చులు, హల్లుల తేడా దృష్ట్యా ‘అల్’ శబ్దం మారిపోతుంది. ఖాదర్, గఫూర్ మొదలైన హల్లు (ఖమ్రీ) అక్షరంతో ప్రారంభమయ్యే పేర్లకు ‘అబ్ద్’ చేర్చినపుడు ఆ రెండిటి మధ్య సంధిగా ఉపయోగపడే ‘అల్’ అనే పదం వ్రాత రూపంలోనే గాక శబ్దరూపంలోనూ యదాతథంగా ఉంటుంది. కాని రహ్మాన్, సత్తార్ లాంటి అచ్చు (షమ్సీ) అక్షరంతో ప్రారంభమయ్యే పేర్లకు ‘అబ్ద్’ చేర్చినపుడు ‘అల్’ పదం యొక్క శబ్దం ఆ పేర్ల ప్రారంభంలోని అచ్చు అక్షరాలకు అనుగుణంగా మారిపోతుంది. ఉదాహరణకు:– పై రెండు పేర్లను అబ్దుల్ రహ్మాన్, అబ్దుల్ సత్తార్ అని గాకుండా “అబుర్రహ్మాన్, అబ్దుస్సత్తార్” అని పలకవలసి ఉంటుంది.



ముస్లింలు దేవుని పేర్లకు ముందు ‘అబ్ద్’ చేర్చి పెట్టుకున్నట్లే హిందువులు దేవుని పేర్ల చివర్లో ‘దాస్’ అనే పదాన్ని చేర్చి పెట్టుకుంటారు. ఉదాహరణకు:– రామ్‌దాస్, కాళిదాస్, భగవాన్‌దాస్ వగైరా. క్రైస్తవులైతే ఏసుదాస్, ప్రభుదాస్ వంటి పేర్లు పెట్టుకుంటారు. దేవుని చేత ప్రసాదించబడినవాడు అన్న అర్థంలో ముస్లింలు అల్లాహ్‌బక్ష్, ఖుదాబక్ష్, ఇనాయతుల్లా, ఇనాముర్రహ్మాన్ మొదలైన పేర్లు పెట్టుకుంటారు. వీటినే హిందువులు హరిప్రసాద్, శివప్రసాద్ అనే పేర్లు పెట్టుకుంటారు. దేవుని చేత అనుగ్రహించబడ్డవాడన్న అర్థంలో ఫజలుల్లాహ్, ఫజలుర్రహ్మాన్, రహీముల్లాహ్, రహ్మతుల్లాహ్ మొదలైన పేర్లు మనకు తెలిసినవే. క్రైస్తవులు పెట్టుకునే మేరీగ్రేస్ అనే పేరు ఈ కోవకు చెందినదే.

ముస్లింలు యావత్తు దైవప్రవక్తలను విశ్వసిస్తారు. కాని క్రైస్తవులు, యూదులు తమ తమ దైవప్రవక్తల్ని మాత్రమే నమ్ముతారు. అందువల్ల ముస్లింలు పెట్టుకునే ప్రవక్తల పేర్లలో అరబీ ఉచ్చారణ ఉంటే క్రైస్తవులు, యూదులు పెట్టుకునే ప్రవక్తల పేర్లలో హిబ్రూ భాష ఉచ్చారణ ధ్వనిస్తుంది. ఉదాహరణకు:– ఆదమ్=Adam(ఆడం), నూహ్=Noah (నోవా), ఇబ్రాహీం=Abraham(అబ్రహాం), ఇస్‌హాఖ్=Isaac(ఇసాక్ లేక ఐజక్), యాఖూబ్=Jacob(జాకబ్), యూసుఫ్=Joseph(జోసెఫ్), సులైమాన్=Soloman (సోలోమాన్ లేక సాల్మన్), దావూద్=David(దావీద్ లేక డేవిడ్), మూసా=Moses (మొజెస్), హారూన్=Aaron(ఆరోన్), అయ్యూబ్=Job(జోబ్), యహ్యా=John(జాన్), లూత్=Lot(లోట్), ఈసా=Jesus(ఏసు) వగైరా. అలాగే దైవదూతల పేర్లు:– జిబ్రాయీల్=Gabriel(గాబ్రియల్), మీకాయిల్=Michel(మైకేల్) మొదలైనవి.

దైవప్రవక్త హ౹జ్రత్ యాఖూబ్ (అలైహి)కు ఇస్రాయీల్ అని మరోపేరు కూడా ఉంది. ఆయన సంతతినే బనీ ఇస్రాయీల్ అంటారు. యూదుల ఆక్రమిత పాలస్తీనాని కూడా ఇస్రాయీల్ అంటారు.

రంగులకు సంబంధించిన కొన్ని పేర్లున్నాయి. ఉర్దూలో కాలేమియా, భూరేమియా, అనే పేర్లు ఈ కోవకు చెందినవే. పాకిస్తాన్‌లో మంత్రిగా పనిచేసిన ఒకతని పేరు జహీరుద్దీన్ లాల్‌మియా. రంగుల విషయంలో ఆంగ్లేయుల పేర్లు ఇలా ఉంటాయి: వైట్, బ్లాక్, బ్రౌన్, గ్రీన్, గ్రె. ఇంగ్లీషు–తెలుగు, తెలుగు–ఇంగ్లీషు నిఘంటువుల్ని రాసిన ప్రముఖ ఆంగ్లేయ రచయిత బ్రౌన్ అన్న సంగతి తెలిసిందే.

దైవప్రవక్త (స) సహచరుల్లో హ౹జ్రత్ అస్వద్ (రజి), హ౹జ్రత్ సౌదా (రజి) అనేవారు ఉన్నారు. అరబీభాషలో నలుపు వర్ణాన్ని అస్వద్ అంటారు. నల్లవాడు అనే భావంలో ఈ పేరు పెట్టారు. దీని స్త్రీలింగమే సౌదా. హిందువులు పెట్టుకునే కృష్ణ లేక క్రిష్ట అనే పేరు కూడా నల్లవాడనే అర్థం వస్తుంది. ‘లైల్’ అంటే అరబీలో రాత్రి అని అర్థం. రాత్రి చీకటిగా, నల్లగా ఉంటుంది గనక ఆ భావంలో స్త్రీని ‘లైలా’ అని అంటారు.

లబన్ అంటే అరబీలో పాలు అని అర్థం. అంచేత పాల వర్ణంలో తెల్లగా ఉండే స్త్రీని “లుబ్నీ” కూడా పేరు పెట్టారు. ముస్లింలలో “హుమైరా” అనే పేరుని చాలామంది విని

ఉంటారు. హుమైరా అంటే ఎర్రని స్త్రీ అని అర్థం. ఈ భావంలో హిందువులు "అరుణ" అని పేరు పెట్టుకుంటారు. అరబీలో జమాల్ అంటే అందం అని అర్థం. అందగాడు అనే భావంలో పురుషులకు జమీల్ అని, అజ్మల్ అని పేర్లుంటాయి. అదే స్త్రీ అయితే జమీలా అంటారు. హసన్, హసీనా అనే పేర్లు కూడా ఇలాంటివే. హిందువుల్లో సుందరి, శ్యామ్‌సుందర్ అనే పేర్లు తెలిసినవే.

స్వర్గంలోని అప్సరసలను అరబీలో హూర్ అంటారు. అందగత్తె అనే అర్థంలో స్త్రీలకు హూర్‌బాను అని కూడా పేరు పెడ్తారు. హూర్ అనేది నిజానికి బహువచనం. కాని ఉర్దూలో ఇది ఏకవచనంగా చలామణి అవుతోంది.

నగలలో పొదిగే విలువైన రాళ్ళ పేరు మీద మనుషుల పేర్లు ఇలా ఉంటాయి: నీలం, జమ్రుద్, అల్మాస్, యాఖూత్, మర్జాన్ వగైరా. ఫిరోజ్ అంటే జయప్రదం, అదృష్టం, సౌభాగ్యం అని అర్థాలున్నాయి. అందువల్ల ఈ పేర్లు కూడా పెట్టుకుంటారు. ఉత్తర భారత్‌లో హీరాలాల్, మోతీలాల్, రతన్‌లాల్, జవహర్‌లాల్ వగైరా పేర్లు తెలిసినవే. మన రాష్ట్రంలో రత్నం, మణి, ముత్యాలు లాంటి పేర్లున్నాయి.

పువ్వుల పేర్ల మీద పెట్టుకునే పేర్లు ఎలా ఉంటాయో చూడండి: నర్గిస్, యాస్మీన్ (మల్లెపువ్వు), రీహాన్, నీలోఫర్ (తామరపువ్వు), అనార్కలి, చంపాకలి. ఈపేర్లు ఎక్కువగా స్త్రీలు పెట్టుకుంటారు. గులాబీ పేరు మీద సిక్కుల పేర్లుంటాయి. ఉదా:–గులాబ్‌సింగ్.

జంతువుల పేర్ల మీద ఉండే మనుషుల పేర్లు అరబీలో ఇలా ఉంటాయి: అసద్, హైదర్, బాబర్, హారిస్. ఇవన్నీ పులుల పేర్లు. హిందువుల పేర్లలో షేర్‌సింగ్, హరికిషోర్, వగైరా తెలిసినవే. హిందీలో సింగ్, హరి అంటే సింహం అని అర్థం. సిక్కులందరి పేర్ల చివర్లో సింగ్ అనేది తప్పనిసరిగా ఉంటుంది. అయితే సింగ్ అని పెట్టుకున్న ప్రతి వ్యక్తి సిక్కు కానవసరం లేదు. రాజపుత్రులు కూడా తమ పేర్ల చివర్లో సింగ్ అని పెట్టుకుంటారు. ఉదాహరణకు మన మాజీ ప్రధాని విశ్వనాథ్ ప్రతాప్ సింగ్. ఇవన్నీ సాహసానికి, పౌరుషానికి పెట్టిన పేర్లు.

నక్షత్రాలు, గ్రహాల పేర్లు: ముస్లింలయితే ఆఫ్తాబ్, మహ్తాబ్, షమ్సుద్దీన్, ఖమ్రుద్దీన్, బద్రుద్దీన్, హిలాల్ అని పెట్టుకుంటారు. ఇవన్నీ సూర్యచంద్రుల పేర్లు. ఈ అర్థాల్లో హిందువులైతే భాస్కర్, చంద్రమ్, రవి, పూర్ణచంద్రుడు, శశాంక్, సూర్యకాంత్, చంద్రకాంత్ అని పెట్టుకుంటారు. నక్షత్రాల పేర్లు: నజ్మ్ (నజ్ముద్దీన్, నజ్మున్నిసా), షిహాబ్ (షిహాబుద్దీన్), అఖ్తర్, కౌకబ్, సాఖిబ్, తారిఖ్, సురయ్యా మొదలైనవి.

షమ్సుద్దీన్ అంటే ధర్మంలో సూర్యునివంటి వాడని, ఖమ్రుద్దీన్ లేక బద్రుద్దీన్ అంటే ధర్మంలో చంద్రుని వంటివాడని, నజ్ముద్దీన్ అంటే ధర్మంలో నక్షత్రం వంటివాడని, షియాబుద్దీన్ అంటే ధర్మంలో ఉజ్వల తార (లేక ఉల్క) అని, నజ్మున్నిసా అంటే స్త్రీలలో తార వంటిదని, ఖమ్రున్నిసా అంటే స్త్రీలలో చంద్రుని వంటిదని అర్థాలు ఉన్నాయి.



హిలాల్ అంటే పూర్ణశశాంకుడు. అఖ్తర్ (మేల్కొలుపు నక్షత్రం), సాఖిబ్ (మెరిసే ఉల్క), కౌకబ్ (చిన్న నక్షత్రం), తారిఖ్ (ప్రభాత నక్షత్రం), సురయ్యా (కృత్తికా నక్షత్రం). గ్రహాల పేర్ల మీద జహ్రా, నాహీద్, ముష్తరీ వగైరా పేర్లున్నాయి. జహ్రా లేక నాహీద్ అంటే శుక్రగ్రహమని, ముష్తరీ అంటే బృహస్పతి గ్రహమని అర్థాలున్నాయి.

వృత్తుల పేర్ల మీద కూడా కొందరు పేర్లు పెట్టుకుంటారు. ఉదాహరణకు:– అత్తార్, ఖాజీ, వజీర్, బక్ష్ వగైరా. వృత్తుల పేర్ల మీద ఆంగ్లేయులు గోల్డ్‌స్మిత్, బ్లాక్‌స్మిత్, ఇంజినీర్, మర్చెంట్, మాస్టర్, బజాజ్ మొదలైన పేర్లు పెట్టుకుంటారు.

వ్యాపారంలో అమ్మే సరుకుల పేర్లు కూడా కొందరి పేర్లకు అంతర్భాగాలై పోతాయి. ఉదాహరణకు:– బటన్‌వాలా, పేరావాలా, రేషమ్‌వాలా, లక్కడ్‌వాలా, మోతీవాలా. ఇవన్నీ హిందీ పేర్లు. అలాగే కిరాణా వర్తకుడ్ని హిందీలో గాంధీ అంటారు. గాంధీ అంటే సుగంధ ద్రవ్యాల వ్యాపారి అని కూడా మరో అర్థం ఉంది. మహాత్మా గాధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ఇలాంటి పేర్లున్నవారే. కరాచీ (పాకిస్తాన్)లో ఒక చోట డాక్టర్ అబ్రుహీమ్ గాంధీ క్లినిక్ పేరుతో ఒక ముస్లిం వైద్యశాల ఉంది. ఇలాంటి అర్థంలోనే భండారీ అనే పదం కూడా ఉంది. కర్పూరం అమ్మేవాడ్ని కపూర్ అంటారు. రాజ్‌కపూర్, షమ్మీకపూర్ వగైరా సినిమా తారల పేర్లు దీన్నిబట్టే వచ్చాయి.

దేశాలు, ఊర్ల పేరిట పెట్టుకునే పేర్లు:– బుఖారి, బగ్దాది, హజాజి, తిర్మిజి, మదనీ, మక్కీ, మిస్రీ, గజనవి మొదలైనవి. భరతుడు, భారత్ భూషణ్, భారతీ అన్న పేర్లు కూడా ఇలాంటివే. రేలంగి, ధూళిపాళ్ళ వంటి సినీతారల పేర్లు తెలిసినవే.

జాతులు, తెగల పేర్లు:– ఖురైషీ, తమీమి, గఫ్ఫారి, ఆమిరి, అన్సారి మొదలైనవి. మన దేశంలో భట్, పాండే, చౌహాన్ అనే పేర్లు ముఖ్యమైనవి. గురువుల పేర్ల మీద పెట్టుకునే పేర్లు:– హాష్మీ, అబ్బాసీ, ఉస్మానీ, అల్వీ, రజ్వీ, కాజ్మి, నఖ్వీ, హుసైని, జాఫరి, జైది, నిజామి, సహర్‌వర్ది, నక్షబంది వగైరా. ఇవన్నీ అసలు పేర్లకు చివర్లో వస్తాయి.

బిరుదాంకితులు:– కొందరి పేర్లకు బిరుదులు కలసివుంటాయి. ఇవి రెండు రకాలు. ప్రభుత్వం ఇచ్చే బిరుదులు, ప్రభుత్వేతరులు లేక ప్రజలు ఇచ్చే బిరుదులు. ప్రభుత్వాలు ఇచ్చే బిరుదుని ఉర్దూలో 'ఖితాబ్' అంటారు. బ్రిటిష్ పాలనాకాలంలో భారత ప్రభుత్వం విశ్వాసపాత్రులైన ముస్లింలకు, పార్శీలకు ఖాన్‌సాహబ్, ఖాన్ బహదూర్ వంటి బిరుదులు ఇచ్చేది. హిందువులకైతే రాయ్‌సాహబ్, రాయ్ బహదూర్ అని; సిక్కులకైతే సర్దార్‌సాహబ్, సర్దార్ బహదూర్ అని ఉంటాయి. ప్రముఖ సంఘసంస్కర్త రాజారామమోహన్ రాయ్, స్వాతంత్ర్య యోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇలాంటి బిరుదాంకితులే. బ్రిటిష్‌వారు ఇచ్చిన బిరుదుల్లో 'సర్' కూడా ఉంది. విశ్వవిఖ్యాత ఉర్దూకవి అల్లామా ఇఖ్బాల్‌కు 'సర్' బిరుదు లభించింది. ప్రఖ్యాత స్వాతంత్ర్య యోధుడు, అలిగఢ్ ముస్లిం యూనివర్సిటీ వ్యవస్థాపకుడు అయిన సర్ సయ్యిద్ అహ్మద్ పేరులోనే ఉంది ఆయన బిరుదు.

ప్రభుత్వేతర బిరుదులు కలిగివున్నవారు:- ఖాయెదె ఆజం ముహమ్మద్‌అలి జిన్నాలో 'ఖాయెదెఆజం', నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌లో 'నేతాజీ', అబుల్‌కలామ్ ఆజాద్‌లో 'ఆజాద్' అనేవి బిరుదులే. మహాప్రవక్త (స) కాలంలో దైవప్రసాదిత బిరుదులు పొందిన అబూ బకర్ సిద్దీఖ్, ఉమర్ ఫారూఖ్, ఉస్మాన్ గని, అలి ముర్తుజా, ఖాలిద్ బిన్ వలీద్ సైఫుల్లా, అమీనుల్ ఉమ్మత్ అబూఉబైదా (రజి) వగైరా సహాబీల పేర్లలోని సిద్దీఖ్, ఫారూఖ్, గని, ముర్తుజా, సఫుల్లా, అమీనుల్‌ఉమ్మత్ అనేవి కూడా బిరుదులే. ఈ బిరుదులు బిరుదాంకి తులతోనే అంతం కాకుండా ఆ తరువాత కూడా వంశపారంపర్యగా కొనసాగుతాయి. ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పి.సి. సర్కార్‌కు 'సర్కార్' అనే బిరుదు ఇలా వంశపారం పర్యగా లభించినదే.

సంతానం, తల్లిదండ్రుల బంధుత్వాన్ని బట్టి వచ్చే పేర్లను 'కునియత్' అంటారు. ఇవి అసలుపేరుకు ముందు అబ్, ఉమ్, ఇబ్న్, బిన్త్ అదే పదాలు చేరివుంటాయి. ఇలా దైవప్రవక్త (స)కు వచ్చిన ఓ పేరు అబుల్‌ఖాసిం. దైవప్రవక్త (స) కుమారుని పేరు ఖాసిం కనుక ఆయనకా పేరు వచ్చింది. అలాగే విశ్వాసుల మాతృమూర్తి అన్న భావంలో ప్రవక్త సతీమణులను "ఉమ్ముల్‌మోమినీన్" అంటారు. అబూతాలిబ్, అబూసుఫ్యాన్, ఉమ్మెసల్మా, ఇబ్నెఅబ్బాస్, బిన్తెఫాతిమా వగైరా పేర్లు ఈ రకానికి చెందినవే.

అయితే ఈ పదాలు ఒక్కోసారి జంతువులు, వస్తువులకు సంబంధించినవై కూడా ఉంటాయి. ఉదా:- అబూహురైరా, అబుల్‌కలామ్, అబూతురాబ్ వగైరా. అబూహురైరా అంటే పిల్లులవాడని అర్థం. ఆయనకు పిల్లులంటే ఎంతో ప్రేమ. మంచి వాక్పటిమ కల వాడ్ని అబుల్‌కలామ్ అంటారు. అబూతురాబ్ అంటే మట్టివాడని అర్థం. హజ్రత్ అలీ (రజి) మరో పేరే అబూతురాబ్. ఒకసారి ఆయన కటికనేల మీద పడుకొని ఉన్నారు. తురాబ్ అంటే మన్ను. ఈ భావంలో దైవప్రవక్త (స) ఆయన్ని ప్రేమతో "అబూతురాబ్! లే" అని అన్నారు. అప్పటినుంచి ఆయనకు అబూతురాబ్ అని ముద్దుపేరు వచ్చింది.

ఇస్లాంకు బద్ధవిరోధి అయిన అబూజహల్ పేరు చాలామంది వినే ఉంటారు. అతని అసలుపేరు అబుల్‌హకమ్. దీనర్థం చాలా తెలివైనవాడని. అయితే అజ్ఞానం, మూఢ త్వాలు కరుడుగట్టిన వ్యక్తిగా తయారైనందున అతనికి అబూజహల్ అనే పేరొచ్చింది.

అబూ, ఉమ్ అనే పదాలు మరో రకంగా కూడా ఉపయోగించబడుతున్నాయి. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే అవకాశవాదిని ఇబ్నుల్‌వఖ్త్ అంటారు. అన్ని చెడులకు మూలం అనే అర్థంలో మద్యాన్ని ఉమ్ముల్ ఖబాఅస్ అంటారు. అలాగే వివిధ రోగాలకు మూలం అనే భావంలో అజీర్ణవ్యాధిని ఉమ్ముల్ అమ్రాజ్ అంటారు.

దేవుని పేరుకు ముందు అబ్ద్ అని చేర్చితే దైవదాసుడు అన్న అర్థం వస్తుందని మనం తెలుసుకున్నాం. అబ్ద్ అంటే దాసుడని అర్థం. అబ్ లేక అబూ అంటే తండ్రి అని అర్థం. అయితే ఈ అబ్ అనే పదాన్ని దేవుని పేరుకు ముందు చేర్చితే దేవునికి



సంబంధించిన వాడని, దైవభక్తుడని అర్థం వస్తుంది. జమాఅతే ఇస్లామీ వ్యవస్థాపకులు మౌలానా అబుల్‌ఆలా (రహ్మాలై) పేరును ఈ భావంలోనే పెట్టడం జరిగింది.

కవులు, రచయితలు కొందరు ప్రత్యేకంగా కలం పేరు పెట్టుకుంటారు. గాలిబ్, నయ్యర్, అఖ్తర్, బేదిల్, బద్నామ్ వగైరా ఈ కోవకు చెందినవే. మరికొందరు కవులు తమ పేర్లను పొడిఅక్షరాలలో పెట్టుకుంటారు. తెలుగు కవులలో శ్రీరంగం శ్రీనివాసరావు, సి.నారాయణ రెడ్డి,- శ్రీశ్రీ గాను, సినారె గాను ప్రసిద్ధిచెందిన సంగతి తెలిసిందే.

ముస్లింలలో, ఫార్శీలలో కొన్ని ఉమ్మడి పేర్లున్నాయి. పర్వీన్, జమ్షీద్, జహాంగీర్, రుస్తుం అనేవి ఫార్శీల పేర్లయినప్పటికీ ముస్లింలు కూడా పెట్టుకుంటారు. ఖడ్గం పేరుతో ముస్లింలేగాక ముస్లిమేతరులు కూడా పేర్లు పెట్టుకుంటారు. సైపుద్దీన్, హుసాముద్దీన్, షమ్షీర్ బేగ్, జుల్ఫికార్- ఈ పేర్లన్నిటిలోనూ కరవాలం అర్థం వచ్చే పదాలున్నాయి.

అనేక ముస్లిం పండితుల పేర్లకు చివర్లో నద్వి, నిజామి, ఉమ్రి అనే పేర్లు ఉంటా యన్న సంగతి తెలిసిందే. ఈ పేర్లు ఆ పండితులు చదివిన ధార్మిక పాఠశాలలకు సంబం ధించినవి. దక్షిణ భారత్‌లోని ఉమ్రాబాద్‌లో ప్రఖ్యాత ధార్మిక పాఠశాలలో చదివి ఆలిమ్ కోర్స్ పట్టా పుచ్చుకున్నవారు ఉమ్రీగా పిలువబడతారు. ఉదాహరణకు:- జలాలుద్దీన్ ఉమ్రి, అబ్దుల్లా ఉమ్రి వగైరా.

కొన్ని దేశాలలో పాలకులు కరుడుగట్టిన జాతీయతత్వం, నాస్తికత్వాల కారణంగా అరబీ పేర్లను ఉచ్చారణతో సహా మార్చివేశారు. టర్కీ మాజీ అధినేత కమాల్‌పాషా, అతాతుర్క్ టర్కీ, అరబీ భాషల లిపిని మార్చి లాటిన్ లిపిని ప్రవేశపెట్టాడు. దాంతో అసలు పేర్ల స్వరూపాలే మారిపోయాయి. ఖాలిదా అదీబ్ ఖానం పేరు కాస్తా 'హాలిడా అడిబ్ హానుమ్'గా మారిపోయింది. (కమ్యూనిస్టు దేశమైన) అల్బానియా మాజి నియంత పేరు 'ఎన్వర్ హోక్స్‌హా'. కాని అతని అసలుపేరు అన్వర్ ఖాజా. ఇండోనేషియాలో కొందరు ఇస్లాంపేర్లతో పాటు అర్జున్, శివ, విష్ణు అని కూడా తగిలించుకుంటారు.

పేరులో తప్పుడు భావం రాకుండా జాగ్రత్తపడటం ముస్లింల కర్తవ్యం. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: విశ్వాసుల మాతృమూర్తి జైనబ్ బిన్తె జహష్ (రజి) గారి పేరు మొదట్లో బర్రా అని ఉండేది. దానిపై ప్రజలు "ఈమె తనను తాను పవిత్రురాలని, పుణ్యవతి అని భావిస్తోంది" అని చెప్పుకునేవారు. అంచేత దైవప్రవక్త (స) ఆమెకు జైనబ్ అని పేరు పెట్టారు. (బుఖారి, ముస్లిం)

దైవపవక్త (స) ప్రవచనం: "మీరు నా పేరు పెట్టుకోవచ్చు. కాని నా మారుపేరు (అబుల్‌ఖాసిం అ)ని పెట్టుకోకండి." (బుఖారి);

దైవపవక్త (స) హితోక్తి: "ఎవరైనా రాజాధిరాజు అని పేరుపెట్టుకుంటే అది దేవుని దృష్టిలో అతి నీచమైన పేరుగా పరిగణించబడుతుంది." (బుఖారి, ముస్లిం)